31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా

శనివారం 30 మే 2026 పేజీలు : 8

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- రైస్ మిల్లుల వద్ద ధాన్యం 24 గంటల్లో అన్లోడింగ్ చేయాలి
- జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్.లత



**చురకలు విలేకరి, రాయికల్, మే 29 :** ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని, రైస్ మిల్లుల వద్ద ధాన్యం 24 గంటల్లో అన్లోడింగ్ చేయాలని జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్. లత అన్నారు. రాయికల్ మండలం మైతాపూర్ గ్రామంలో శుక్రవారం పిఎసి ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధా న్యం కొనుగోలు కేంద్రం, రాయికల్ మండలంలోని శివమని రైస్ మిల్లును జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్. లత ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాలలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రత్య క్షంగా పరిశీలించి రైతులకు -2లో

## చివరి గింజ వరకు
# కొనుగోలు చేస్తాం



- రైతులు ఎటువంటి ఆందోళనకు గురికావద్దు
- యంత్రాంగం వరిధాన్యాన్ని త్వరిత గతిన కొనుగోలు చేయాలి
- రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ మే 29 :** రైతుల వద్ద నుండి ప్రభుత్వం చివరి గింజ వరకు వరి ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. యాసంగి సీజన్ లో భారీ మొత్తంలో పంట చేతికి రావడం వల్ల ఆలస్యం అవుతుందని, రైతులు ఆందోళన చెందవద్దని, అధైర్యపడవద్దని తెలంగాణ ఐటి, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం మంథని వ్యవసాయ మార్కెట్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి శ్రీధర్ బాబు పరిశీలించారు. రైతులతో ముచ్చటించారు. రైతులకు ధాన్యం కొనుగోలు చేసే వరకు సకల సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. బిజెపి, బీఆర్ఎస్ పార్టీ నేతలకు రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని మంత్రి శ్రీధర్ బాబు విమర్శించారు. -2లో

## మహిళల ఆర్థిక అభివృద్ధే
# ధ్యేయంగా పథకాలు అమలు

### -ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్





**చురకలు ప్రతినిధి సిరిసిల్ల, మే 29 :** రాష్ట్రంలోని మహిళల ఆర్థిక అభివృద్దే ధ్యేయంగా పథకాలు అమలు చేస్తున్నామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా మహిళా సంక్షేమ వారోత్సవాల కింద మహిళా స్వయం సహాయక సభ్యులకు బ్యాంక్ లింకేజీ రుణాల పంపిణీ కార్యక్రమాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్కే ఫంక్షన్ హాల్ లో శుక్రవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రుణాల పంపిణీ..337 సంఘాలకు బ్యాంక్ లింకేజీ కింద రూ. 40 కోట్లు, ఎఫ్ పీసీ, ఎఫ్ పీజీ సీఐఎఫ్ కింద 42 సంఘాలకు రూ.1 కోటి ఐదు లక్షలు, శ్రీనిధి రూరల్ కింద 278 సంఘాలకు రూ.7 కోట్ల 13 లక్షలు, బ్యాంక్ లింకేజీ మెప్మా రుణాలు 55 సంఘాలకు రూ.6 కోట్ల 33 లక్షలు, శ్రీ నిధి మెప్మా 61 సంఘాలకు రూ. కోటి 50 లక్షల విలువైన చెక్కులను మహిళా సంఘాల బాధ్యులకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అందజేశారు. అలాగే ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహించే సంఘాలకు రూ.11,36, 113 కమిషన్ చెక్కును అందజేశారు. స్టాళ్లు ఏర్పాటు చేయగా, ప్రభుత్వ విప్, జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ మార్చి 6 వ తేదీన 99 రోజుల కార్యాచరణలో సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారని గుర్తు చేశారు. వివిధ శాఖల-2లో

## సంచలన పీఎంజే రాబరీ కేసు
# సూత్రధారి సుభోధ్ సింగ్ అరెస్ట్

- పోలీసు కస్టడీకి పిటిషన్
- బీహార్‌లోని ఆరు కోర్టుల పీటీ వారెంట్లతో బీహార్ జైలు నుంచి కరీంనగర్‌కు తరలింపు
- సీపీ గౌష్ ఆలం



**చురకలు క్రైమ్ ప్రతినిధి,కరీంనగర్, మే 29 :** ఈ నెల 3వ తేదీన కరీంనగర్ పట్టణంలోని పీఎంజే జ్యువెలరీలో పనిచేసే ఉద్యోగులపై కాల్పులు జరిపి దోపిడీకి పాల్పడిన సంచలన రాబరీ కేసులో ప్రధాన నిందితుడు, సూత్రధారి అయిన సుభోధ్ సింగ్‌ను కరీంనగర్ పోలీసులు బీహార్ రాష్ట్రంలోని పూర్ణియా జైలు నుంచి పీటీ వారెంట్‌పై అదుపులోకి తీసుకున్నట్లు పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. ఈ కేసుతో పాటు ఇతర కేసుల్లోనూ నిందితుడిగా ఉన్న సుభోధ్ సింగ్‌పై వివిధ కోర్టుల్లో నమోదైన కేసుల నేపథ్యంలో, మొత్తం ఆరు కోర్టుల పరిధిలో పీటీ వారెంట్లకు అనుమతులు పొందిన అనంతరం అతడిని కస్టడీలోకి తీసుకుని కరీంనగర్‌కు తరలించినట్లు సీపీ పేర్కొన్నారు. సుభోధ్ సింగ్‌తో పాటు ప్రత్యేక పోలీసు బృందం గురువారం రాత్రి కరీంనగర్‌కు చేరుకోగా, అర్ధరాత్రి నిందితుడిని గౌరవ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచినట్లు తెలిపారు. అనంతరం కోర్టు రిమాండ్ విధించడంతో అతడిని జైలుకు తరలించినట్లు వెల్లడించారు. కేసుకు సంబంధించిన అంశాలపై మరింత లోతుగా విచారణ జరిపేందుకు, నిం దితుడిని వారం రోజుల పాటు పోలీసు కస్టడీకి అప్పగించాలని కోరుతూ కరీంన గర్ కోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు సీపీ గౌష్ ఆలం తెలిపారు. -2లో

## ప్రతి ఓటరు వివరాలను
# క్షుణ్ణంగా పరిశీలించాలి

### రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి





**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మే-29 :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్.) కార్యక్రమం ద్వారా ప్రతి ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించా లని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలె క్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఎన్నిక ల నమోదు అధికారులు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్.ఐ.ఆర్ పై శిక్షణా కార్యక్రమం, మ్యాపింగ్ పురోగతిని సమీక్షించారు. జగిత్యాల జిల్లా కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్.లత పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర -2లో

## ఉద్యోగుల అనుమానాలను నివృత్తి చేయాలి



**చురకలు విలేకరి,జగిత్యాల,మే 29 :** హెల్త్ కార్డుల విషయంలో ఉద్యోగుల అనుమానాలను నివృత్తి చేయాలని తపస్ నాయకులు బోనగిరి దేవయ్య ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయులందరికీ వచ్చే జూన్ 2న హెల్త్ కార్డులు అందజేయనున్నామని ఈ మేరకు ఈనెల 31 వరకు ఉద్యోగులు తమ వివరాలను అప్లోడ్ చేయాలని ప్రకటన చేయడంతో రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధ్యాయులందరూ ఈ విధానం ద్వారా తమకు హెల్త్ కార్డులు అవసరం లేదనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారన్నారు. డిఎలు, పిఆర్సిలు అడిగితే హెల్త్ కార్డులు మాత్రమే ఇస్తామని ప్రభుత్వం చేతులు దులుపుకోవడంతో ఉద్యోగ ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారన్నారు. డబ్బులు మినహాయించుకుని ఇచ్చే ఈ హెల్త్ కార్డులు తమకు అవసరం లేదని అభిప్రాయాన్ని ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాలు వ్యక్తపరుస్తున్నారన్నారు. తమ మూలవేతనంలో 1.5 శాతం మినహాయించుకొని హెల్త్ కార్డులు అందజేస్తామనడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాల్లో తీవ్రమైనటువంటి వ్యతిరేకత వస్తుందన్నారు.

## ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రోత్సాహం



**చురకలు విలేకరి,మెట్‌పల్లి రూరల్, మే 29 :** మెట్ పల్లి మండల బండలింగాపూర్ గ్రామ ఉన్నత పాఠశాలలో ఇటీవలే పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులలో మొదటి ర్యాంక్ సాధించిన వైష్ణవి కు 10వేల రూ. రెండవ ర్యాంక్ సాధించిన నక్షత్ర కు 5వేల రూ నగదు బహుమతిని సర్పంచ్ కనగందుల లక్ష్మి సంజీవ్ అందజేశారు.స్కూల్ డేవలప్మెంట్ కమిటీ ఆధ్వర్యంలో ఇట్టేది ప్రతాప్ రెడ్డి పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించిన 34మంది విద్యార్థులకు ఒక్కకరికి 500 చొప్పున నగదు ప్రోత్సాహం అందజేసి విద్యార్థులను అభినందించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జితేందర్ రెడ్డి,గ్రామ పాలక వర్గ సభ్యులు మరియు స్కూల్ డేవలప్మెంట్ కమిటీ సభ్యులు,ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడిని అభినందించిన కమిషనర్



**చురకలు ప్రతినిధి**

**కమాన్‌పూర్ మే 29 :** రామగిరి మండలశీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బేగంపేట్ నందు గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న మల్లా రామ కిషన్ రావును కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ హైదరాబాద్ ఈ. నవీన్ నికోలస్ , పదవ తరగతిలో 550 మార్కులు సాధించిన విద్యార్థులను విమానంలో తీసుకుని వెళ్లి , గత రెండు సంవత్సరాలుగా పదవ తరగతి విద్యార్థులకు, చదువు పట్ల ఆసక్తి కలిగించుటకు, రీడింగ్ కార్నర్స్ ఏర్పాటు చేస్తున్నందుకు, వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చినటువంటి వార్తలను చూసి ఈరోజు రామ్ కిషన్ రావును, హైదరాబాదులోని తన కార్యాలయంలో పిలిపించి అభినందించడం జరిగింది. పాఠశాలలో నిర్వహిస్తున్న విద్యా కార్యక్రమాల గురించి, అడిగి తెలుసుకున్నారు. గత రెండు సంవత్సరాల నుండి అత్యుత్తమ మార్కులతో విద్యార్థులు పాస్ అవుతున్నందుకు ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. మా పాఠశాలను ఈ విద్యా సంవత్సరంలో సందర్శిస్తానని తెలియజేయడం జరిగింది. ఉపాధ్యాయులందరూ మరింత బాధ్యతగా పనిచేసి విద్యార్థులకు మంచి విద్యను అందించాలని సూచించారు. కాగా రామ్ కిషన్ రావును జిల్లా విద్యాధికారి శారద ఏ ఎం ఓ షేక్ అభినందించడం జరిగింది.

# మహిళల ఆర్థిక అభివృద్ధే...

**మొదటి పేజీ తరువాయి...** రూపకల్పనకు కార్యక్రమం కోసం ప్రభుత్వం ఈ కార్యాచరణ అమలు చేస్తుందని వివరించారు. రాష్ట్రంలో మహిళా స్వయం సహాయక సంఘాలకు 57 వేల కోట్లు బ్యాంక్ లింకేజ్ రుణాలు మంజూరు చేశామని వెల్లడించారు. రుణాలకు సంబంధించిన వడ్డీని తిరిగి చెల్లించామని తెలిపారు.ప్రతి మహిళను కోటీశ్వరులుగా చేసేందుకు ప్రజా ప్రభుత్వం వివిధ పథకాలు, రుణాలను మంజూరు చేస్తుందని వివరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 60 శాతం మహిళా సంఘాలకే ఇచ్చామని తెలిపారు. ప్రతి పథకంలో మహిళలకు ప్రాధాన్యం ఇస్తూ ముందుకు వెళు తున్నామని, ప్రజలను, మహిళలను భాగస్వా ములను చేసేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తు న్నామని పేర్కొన్నారు. కోటి మంది మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ చేశామని, సిరిసిల్ల లో 37వేల మందికి ఇస్తున్నామని వెల్లడించారు. రెండో దశలో కోటి చీరలకు ఆర్డర్ ఇచ్చామని తెలిపారు. మహిళా సంఘాలకు మంజూరు చేసిన బస్సులతో ప్రతి నెలా రూ.68 వేల ఆదాయం వస్తుందని వివరించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో ఉత్తమ పనితీరుతో సేవలు అందిస్తున్నారని కొనియాడారు. మహిళా సంఘాలకు ఆధ్వర్యంలో ఎరువుల షాపు లు ఇవ్వాలని, మహిళా సంఘాలకు ప్రతి మండలానికి ఒకటి రైస్ మిల్లు ఇవ్వాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలు దేశానికే ఆదర్శంగా ఉన్నాయని చక్కటి సంక్షేమ పథకాలు రాష్ట్రంలో అమలు అవుతున్నాయని తెలిపారు. అన్ని వర్గాల ప్రయోజనమే లక్ష్యంగా ప్రభుత్వం పథకాలు అమలు చేస్తుందని వివరించారు. రైతులకు ఒకే సారి రూ. రెండు లక్షల రుణ మాఫీ చేశామని, నూతన రేషన్ కార్డులు మంజూరు చేశామని, సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు ఊపు అందుకున్నాయని పేర్కొన్నారు. ఇండ్ల నిర్మాణాలకు రూ. ఐదు లక్షల ఆర్థిక సహాయం అందించడం ఎక్కడా లేదని స్పష్టం చేశారు. వచ్చే నెల జూన్ 2వ తేదీ తరువాత మరిన్ని ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని తెలిపారు. మహిళలు రాజకీయ రంగంలోకి కూడా రావాలని సూచించారు. మన జిల్లా అన్ని విభాగాల్లో ఉత్తమ ప్రతిభ చూపి మిగతా జిల్లాలకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ మార్చి 6 వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. 10 థీమ్ లతో 10 శాఖల ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను విజయ వంతంగా అమలు చేస్తున్నామని వెల్లడించారు. మహిళా సంక్షేమ వారోత్స వాల్లో భాగంగా బాల్య వివాహాల నిర్మూలన, మహిళలపై లైంగిక వేధింపుల నివారణ నిషేధము పరిష్కారాల చట్టం 2013 వివిధ అంశాలపై అవగాహన కల్పించామని వెల్లడించారు. జిల్లాలోని మహిళా సంఘాలు తీసుకుంటున్న రుణాలు సద్వినియోగం చేసుకోవాలని, స్వయం ఉపాధి వైపు ఉపయోగించాలని పిలుపు నిచ్చారు.మహిళా స్వయం సహాయక సంఘాల ఎన్ పీఏ తక్కువగా ఉందని తెలిపారు. మన జిల్లా నుంచి ఉత్తమ అవార్డ్ తీసుకున్నామని గుర్తు చేశారు. బ్యాంక్ రుణాలను తినుబండారాలు, కిరాణా షాప్, మగ్గం వర్క్, ఇతర ఉపాధి పొందే వాటి కోసం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంకా ప్రభుత్వ సబ్సిడీ పథకాలు ఉన్నాయని, వాటి వివరాలు సంబంధిత శాఖల వద్ద పొందాలని పిలుపు నిచ్చారు.జిల్లాలో ఆయా మండలాలకు కేటాయించిన బస్సులతో ప్రతి నెల ఆదాయం వస్తుందని వివరించారు. సోలార్ ప్లాంట్, పెట్రోల్ బంక్ ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లు మహిళా సంఘాల ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయని, విజయవంతంగా కొనుగోలు చేస్తున్నారని వెల్లడించారు.వృద్ధ మహిళలు, కిశోర బాలికలకు మహిళా సంఘాల ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. బ్యాంక్ ల కార్యకలాపాలు, అకౌంట్ తీయడంపై అవగాహన కిశోర బాలికలకు వస్తుందన్నారు. కార్యక్రమంలో వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వీర్నపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ రాములు నాయక్, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున రావు. తహసీల్దార్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

**మొదటి పేజీ తరువాయి...** ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేగంగా కొనుగోలు ప్రక్రియను కొనసాగించాలని అధికారులకు సూచించారు. కేంద్రాలలో హమలీలు తగిన సంఖ్యలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ధాన్యం లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేసి లారీలను ఆలస్యం లేకుండా మిల్లులకు తరలించాలని ఆదేశించారు. ట్రక్ షీట్ నమోదు, ట్యాబ్ ఎంట్రీలు వంటి అన్ని డాక్యుమెంటేషన్ పనులను సమయానికి పూర్తి చేయాలని, ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాలలో పారదర్శకత పాటించడంతో పాటు రైతులకు సరైన సమాచారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు సమయంలో తేమ శాతం, నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పరిశీలించాలని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను హెచ్చరించారు. అనంతరం రైస్ మిల్లులను తనిఖీ చేసి మిల్లర్లు హమాలీల సంఖ్య పెంచాలని ధాన్యం తో వచ్చిన లారీలను 24 గంటల్లోగా అన్లోడ్ అయ్యే విధంగా చూడాలని రైస్ మిల్లర్లు అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకొని ధాన్యం కొనుగోళ్ళు సజావుగా, వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ధాన్యం అన్లోడింగ్ లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగార్జున, నాయబ్ తహసీల్దార్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, కేంద్రాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## చివరి గింజ వరకు

**మొదటి పేజీ తరువాయి...** ధర పెంచడమే కాకుండా కొనుగోలు విషయం పైన ఎందుకు ఆలోచన చేయడం లేదని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వాలు రైతులను విస్మరించాయని, కాంగ్రెస్ ప్రభుత్వంలోని వ్యవసాయం అంటే పండుగలా మారిందని వివరించారు. ప్రభుత్వ గోదాములు సరిపడకపోతే ప్రైవేట్ గోదాములను సైతం ఉపయోగించుకొని వరి ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. తడిసిన ధాన్యం సైతం కొనుగోలు చేసి మద్దతు ధర అందజేస్తామని రైతులందరూ అండగా ఉండాలని పేర్కొన్నారు.

# ప్రతి ఓటరు వివరాలను...

**మొదటి పేజీ తరువాయి...**ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ 1950 నుంచి ఇప్పటి వరకు దాదాపు 10 సార్లు ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. తెలంగాణ ప్రాంతంలో గతంలో 2002 లో ఎస్.ఐ.ఆర్. కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. ఎస్.ఐ.ఆర్ కార్యక్రమం ద్వారా శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లు, మరణించిన ఓటర్ల వివరాల తొలగింపు, డబుల్/ డూప్లికేట్ ఎంట్రీల తొలగింపు జరుగుతుందని తెలిపారు. అక్టోబర్ 1, 2026 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించనున్నట్లు చెప్పారు.జూన్ 25 నుండి జూలై 24 వరకు బూత్ లెవల్ అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను పూర్తిస్థాయిలో ధృవీకరించాలని ఆదేశించారు. ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని, ప్రతి అర్హత ఓటరిని గుర్తించి జాబితాలో చేర్చాలని తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా సిద్ధం చేసే ముందు ప్రతి వివరాలు క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.ఒక కుటుంబ సభ్యులందరూ ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉండేలా చూడాలని, 1200 మంది ఓటర్ల సంఖ్య దాటితే కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రతి బి.ఎల్.వో వద్ద ఎన్యుమరేటర్ ఫారాలు తగినంతగా అందుబాటులో ఉండేలా చూడాలని, ఎన్యుమరేషన్ సమయంలో ఎలాంటి ఆధారాలు చూపించాల్సిన అవసరం లేదని తెలిపారు.ప్రతి బీ.ఎల్.వో.కు ఎస్.ఐ.ఆర్ నిబంధనలు, విధి విధానాలు, ఫీల్డ్ వెరిఫికేషన్ విధానం, ఫారాల నిర్వహణపై పూర్తి అవగాహన, పట్టు ఉండేలా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. శిక్షణ కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.డ్రాఫ్ట్ జాబితా విడుదల అనంతరం మ్యాపింగ్‌లో లోపాలు ఉంటే సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. భారత పౌరసత్వ నిబంధనల ప్రకారం అవసరమైన పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జూలై 1, 1987కు ముందు జన్మించిన వారు తమ స్వీయ గుర్తింపు లేదా జనన ఆధార పత్రాలు సమర్పిస్తే సరిపోతుందని, తల్లిదండ్రుల పత్రాలు అవసరం లేదన్నారు. జూలై 1, 1987 నుంచి డిసెంబర్ 2, 2004 మధ్య జన్మించిన వారు తమ పత్రాలతో పాటు తల్లి లేదా తండ్రి ఎవరి అయినా ఒకరి పత్రం సమర్పించాలని, డిసెంబర్ 2, 2004 తర్వాత జన్మించిన వారు తల్లిదండ్రుల ఇద్దరి పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని వివరించారు.

# ప్రతి యూనిట్‌కు లెక్క కట్టాల్సిందే



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం, మే (29) :** వేసవి కాలం లో ఎండలు దంచికొడుతుండటం తో వేసవి తాపనికి జిల్లాలో విద్యుత్ వాడకం బారిగ పెరిగింది. ఉదయం 9 గంటల నుంచే భానుడు విశ్వరూపం ప్రదర్శిస్తుండటం తో వేడి, ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉపశమనం కోసం ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు వినియోగిస్తున్నారు. ఫలితంగా 200 యూనిట్లు దాటడంతో గృహజ్యోతి పథకానికి అనర్హులుగా మారుతున్నారు. జిల్లాలో ఫిబ్రవరి,మార్చి,ఎప్రిల్ ,మే నెలలో గృహజ్యోతి లబ్ధిదారుల సంఖ్య భారీగా తగ్గింది. 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించినవారు ఎక్కువగా విద్యుత్ వినియోగించటంతో అనర్హులుగా మారారు.కాగా కేవలం రోజుల వ్యవధిలో వేలది మంది లబ్ధిదారులు గృహజ్యోతి పథకానికి అనర్హులుగా మారారు.

**మే లో మరింత మంది...**

జిల్లాలో గృహజ్యోతి (ఉచిత) విద్యుత్ పథకానికి లక్షల మంది అర్హులు ఉన్నారు. చాల మంది అనర్హులుగా మిగిలారు. ఏప్రిల్, మేలో వీరి సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం జిల్లాలో 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతుండగా, ముమ్ముందు ఎండలు మరింత పెరిగే అవకాశం ఉంది. దీంతో విద్యుత్ వినియోగం పెరిగి లబ్ధిదారుల సంఖ్య తగ్గే అవకాశం ఉంది. గృహజ్యోతి పథకం ద్వారా పేదలకు ప్రభుత్వం ప్రతీ నెల 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తోంది. కాగా 201 యూనిట్ల విద్యుత్ కాల్చినా, రూ. 1,200 నుంచి రూ.1,300 వరకు బిల్లు చెల్లించాల్సిందే. ఈ విద్యుత్ వాడకంలో 50 యూనిట్ల వరకు ఒక్క లెక్క, 100 వరకు మరో లెక్క ఆపైనా మరో విధంగా యూనిట్లకు లెక్కలు కట్టాల్సి ఉంటుందని సంబంధిత ఉన్నతాధికారులు తెలిపారు.

**గ్రామలలో సైతం పెరిగిన ఎసిలు...**

వేసవి కాలం లో బారిగ పెరుగుతున్న ఉష్ణోగ్రతల తో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నరు.పటణలలో మరింత ఉష్ణోగ్రతలు ఉండటం తో ఎసిలు,కులర్ లు అదికంగా వాడకం జరిగేవి. కాని గ్రామలలో సైతం ఉరికో 50 ఎసిలు,వందల సంఖ్యలో కులర్లు వాడకంతో గృహజ్యోతి లబ్ధిదారుల లెక్క తప్పుతోంది 200 పైగ యునిట్లు వాడకం తో బిల్లులు చెల్లించక తప్పటం లేదు.

**విధ్యుత్ అదా చెయ్యాలి అవసరం మేరకే వాడాలి**

**మధుసుదన్ విధ్యుత్ డివిజన్ అదికారి (మెట్ పల్లి)**

**- విధ్యుత్ వినియోగం పెరుగుతోంది....!**

**- వందల సంఖ్యలో పెరిగిన ఎసిలు,కులర్ల వినియెగం**

**- పెరుగుతున్న గృహజ్యోతి అనర్హులు**

విద్యుత్ అవసరం మేరకు మాత్రమే వాడాలి.రాత్రి వేళల్లో అవసరం ఉన్నప్పుడు మాత్రమే బల్బులు,ఫ్యాన్లు, ఏసీలు,కూలర్లు ఆన్ చేయాలి.అవసరం లేకున్నా కొందరు బల్బులను రూముల్లో వేసి ఉంచుతారు. దీంతో విద్యుత్ వినియోగం పెరిగిపోయి ప్రభుత్వం ఇచ్చే సబ్సిడి నష్టపోవాల్సి వస్తోంది. ఫలితంగా నెలకు రూ.1,200నుండి రూ.1,300 వరకు బిల్లులను చెల్లించాల్సి వస్తోంది.వినియోగదారులు వినియెగం తగ్గించాలి.



## నాలుగు పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభం

**-ఇబ్రహింపట్నం మండల విద్యాధికారి బండారి మధు**



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం మే (29) :** నాలుగు పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభం అవుతున్నట్లు జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండల విద్యాధికారి బండారి మధు శుక్రవారం సుచించారు.ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలనే ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభించింది. మండలంలో గత సంవత్సరం నాలుగు ప్రభుత్వ పాఠశాలలో ప్రారంభించగా ప్రభుత్వం కొత్తగా ఈ సంవత్సరం ఎంపీహెచ్ఎస్ కోజన్ కొత్తూరు, ఇబ్రహీంపట్నం, గోదురు , తిమ్మాపూర్ ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతులను మంజూరు చేసినట్లు మండల విద్యాధికారి తెలిపారు.ఈ ప్రీ ప్రైమరీ తరగతుల కొరకు పాఠశాలలో ప్రత్యేకంగా ఒక తరగతి గదిని కేటాయించడం తో పాటు వాటిలో రంగురంగుల బొమ్మలు, చాట్స్, ఆట వస్తువులు,ఫర్నిచర్ కూడా ప్రభుత్వం సమకూరుస్తుందని వారు తెలపడం జరిగింది. అదేవిధంగా అవసరమైన ఉపాధ్యాయులను , ఆయాలను కూడా ప్రభుత్వం నియమిస్తుందన్నారు.తల్లి తండ్రులు తమ పిల్లలను ఆయా పాఠశాలల్లో నీ ప్రీ ప్రైమరీ తరగతుల్లో చేర్పించాలని ఎంఇఓ కోరారు.

## నకిలీ విత్తనాలు, ఎరువుల అమ్మితే కఠిన చర్యలు



**చురకలు విలేకరి, బీర్పూర్, మే 29 :** నకిలీ విత్తనాలు, ఎరువుల అమ్మితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ సుజాత, ఏవో తిరుపతిలు అన్నారు. శుక్రవారం బీర్ పూర్ మండలంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను టాస్క్ ఫోర్స్ బృందం ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు బిల్లులు లేని విత్తనాలు, రసాయనాలను, ఎరువులను వాడవద్దని, విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేస్తే బిల్లులు తప్పకుండా తీసుకోవాలని సూచించారు. అనంతరం దుకాణాల్లోని పలు రికార్డులను వారు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

# పిల్లల ఎదుగుదల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**-ఐసిడిఎస్ సూపర్వైజర్ శోభారాణి**



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం మే (29) :** పిల్లల ఎదుగుదల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం ఐసిడిఎస్ సూపర్వైజర్ శోభారాణి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా మండలం లోని అమ్మకపేట అంగన్వాడి పరిధిలో శుక్రవారం ఎర్లీ చైల్డ్ డెవలప్మెంట్ ఆక్టివిటీస్ లో బాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సుపర్ వైజర్ మాట్లాడుతూ ఫస్ట్ వెయ్యి రోజుల ప్రాముఖ్యత గురించి వివరించారు. పోషణ ఆరోగ్యము ప్రారంభ అభ్యసనం బాధ్యతమైన సంరక్షణ భద్రత సంరక్షణ శ్రేయస్సు అనే అంశాలను , మొదటి వెయ్యి రోజుల సంరక్షణ అంటే గర్భిణీ అయినప్పటి నుండి బిడ్డ పుట్టిన రెండు సంవత్సరాల వరకు వెయ్యి రోజులు ఆ వెయ్యి రోజుల ప్రాముఖ్యత, పుట్టగానే మురుపాలు కేవలం తల్లిపాలు ఆరు నెలల లోపు బిడ్డకు తల్లిపాల గురించి చెప్పడం జరిగింది తర్వాత అనుబంధ ఆహారము శిశువు అభివృద్ధి,తల్లి దండ్రులతో పిల్లల సంభాషణ తక్కువ ఖర్చుతోటిలో కాస్ట్ మెటీరియల్ స్థానికం గా లభించే వనరులను ఉపయోగించి తక్కువ ఖర్చుతో ఆట మరియు అభ్యసన సామాగ్రి ప్రీస్కూల్ సామాగ్రి తయారు చేసే విధానం అదేవిధంగా ఎలా తయారు చేసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సరిత,అంగన్వాడీ టీచర్లు నవనీత,రామలక్ష్మి ఆశలు,తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# కొండగట్టు అంజన్నకు భారీగా ఆదాయం



**చురకలు విలేకరి, జగిత్యాల, మే 29 :** జగిత్యాల జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో నిర్వహించిన పెద్ద జయంతి ఉత్సవాల సందర్భంగా భక్తులు సమర్పించిన ముడుపులను విప్పగా వచ్చిన బియ్యం, మాలలు, ఎండు కొబ్బరిని శుక్రవారం ఈఓ కార్యాలయంలో అధికారుల సమక్షంలో వేలం వేశారు. భక్తులు సమర్పించిన మాలలు, బియ్యం, కొబ్బరికాయలు, ఎండు కుడకలను వేలం వేయగా దేవస్థానానికి గణనీయమైన ఆదాయం లభించింది. మాలలను వనం అంజి రూ.5 లక్షల 90 వేలుకు దక్కించుకున్నారు. బియ్యాన్ని జగిత్యాలకు చెందిన శ్రీ వెంకటేశ్వర ట్రేడర్స్ కిలోకు రూ.15ల కు, కొబ్బరికాయలను వరంగల్కు చెందిన పి. ప్రభాకర్ రూ.51 వేలకు, ఎండు కుడకలను పుత్తూరి సమ్మయ్య కిలోకు రూ.95 లకు దక్కించుకొన్నారు. పెద్ద జయంతి సందర్భంగా భక్తులు సమర్పించిన ముడుపులకు భారీ స్థాయిలో స్పందన లభించడంతో దేవస్థానానికి గణనీయమైన ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎస్.అంజనారెడ్డి ,దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ రాజమౌళి, సూపరిండెంట్ సునీల్, జూనియర్ అసి స్టెంట్ శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

# గ్రామీణ తెలంగాణలో డిజిటల్ విప్లవానికి శ్రీకారం

**-గిరిజన తండాలకు ఇంటర్నెట్ అందించడానికి సీఎం సిద్ధం**

**-మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నిర్మలా రెడ్డి**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మే 29 :** తెలంగాణలోని ప్రతి గ్రామానికి హైస్పీడ్ ఇంటర్నెట్ అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలంగాణ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు చింతల నిర్మల గోవర్ధన్ రెడ్డి తెలిపారు. కేంద్ర టెలికాం శాఖ మంత్రి జ్యోతిరాధిత్య సింధియాతో సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మారుమూల గిరిజన తండాల వరకు ఇంటర్నెట్, మొబైల్ కనెక్టివిటీ అందించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు నిర్మలారెడ్డి శుక్రవారం ఆమె తెలిపారు. టి-ఫైబర్ ప్రాజెక్టును కేంద్ర పథకాలతో అనుసంధానం చేసి ప్రతి ఇంటికీ డిజిటల్ సేవలు అందించేందుకు సీఎం రేవంత్ రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారని, దీని ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్య, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో టెలి-మెడిసిన్ సేవలు మరింత సమర్థవంతంగా ప్రభుత్వం అమలు చేయనున్నదని నిర్మల రెడ్డి వివరించారు. రాష్ట్రంలో టెలికాం విస్తరణకు, కొత్త టవర్ల ఏర్పాటుకు కేంద్రం పూర్తి సహకారం అందిస్తుందని కేంద్ర మంత్రి రాష్ట్ర ప్రభుత్వానికి హామీ ఇచ్చారని ఆమె తెలిపారు.

# సేవ చేయడానికి లయన్స్ క్లబ్ ఒక చక్కని వేదిక

**-లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ సింహరాజు కోదండ రాములు**




**చురకలు విలేకరి, రాయికల్, మే 29 :** సేవ చేయడానికి లయన్స్ క్లబ్ ఒక చక్కని వేదిక అని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ లయన్ సింహరాజు కోదండరాములు గారు అన్నారు.శు క్రవారం రాయికల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దాతలు ఎనగంటి రాములు,తంగెళ్ల రమేష్ సహకారంతో రెండు నూతన బాడీ ఫ్రీజర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మరెన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించి ప్రజలకు సేవలు అందించాలన్నారు.నూతనంగా ఎన్నికైన రాయికల్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్,కౌన్సిలర్,కోఆప్షన్ సభ్యులను ,దాతలను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు కొత్తపెల్లి రంజిత్ కుమార్,ప్రధాన కార్యదర్శి బొడుగం అంజి రెడ్డి,జిల్లా కోఆర్డినేటర్ రమేష్,చార్టెడ్ ప్రెసిడెంట్ లయన్ మోర హన్మాండ్లు,డిసిలు బత్తిని భూమయ్య, మ్యాకల రమేష్,కాటిపల్లి రాంరెడ్డి, రాయికల్ మున్సిపల్ చైర్మన్ కటకం రవి, వైస్ చైర్మన్ సౌజన్య శ్రీధర్ రెడ్డి,స్థానిక కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్,లయన్స్ క్లబ్ సభ్యులు మచ్చ శేఖర్,దాసరి గంగాధర్,ఆది రెడ్డి,గంప ఆనందం,వాసం ప్రసాద్, బొమ్మ కంటి నవీన్,సుధ వేణి మురళి,కుర్మ సుదర్శన్ రెడ్డి,కొయ్యేడి మహిపాల్ రెడ్డి,గంట్యాల ప్రవీణ్, కనపర్తి శ్రీనివాస్,వాసం స్వామి,సామల్ల లక్ష్మీనారాయణ,ఆడెపు రాంప్రసాద్,ఎర్ర సుమన్,జిల్లాల సూర్యం రెడ్డి,సాంబారు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి విక్రయించిన, సేవించిన కఠిన చర్యలు తప్పవు

**-ధర్మపురి సిఐ రాంనర్సింహ రెడ్డి**




**చురకలు విలేకరి, ధర్మపురి, మే 29 :** మండలం పరిధిలో గంజాయి అమ్మిన, సేవించిన చట్ట రీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ధర్మపురి సీఐ ఎలపాటి రాంనర్సింహ రెడ్డి హెచ్చరించారు.శుక్రవారం ధర్మపురి పట్టణంలో జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు,జగిత్యాల డీఎస్పీ పురుషోత్తం రెడ్డి సూచనలతో, ధర్మపురి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎలపాటి రాంనర్సింహ రెడ్డి ఆధ్వర్యంలో ధర్మపురి ఎస్సై మహేష్ పోలీస్ సిబ్బంది ట్రెయిన్డ్ డాగ్ స్క్వాడ్ సహాయంతో గంజాయి,ఇతర నిషేధిత మాదక ద్రవ్యాల కోసం విస్తృత తనిఖీలు చేపట్టారు.సిఐ రాంనర్సింహ రెడ్డి మాట్లాడుతూ జగిత్యాల జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యం లో మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయని జిల్లా వ్యాప్తంగా యాంటీ డ్రగ్ అండ్ నార్కోటిక్ ప్రత్యేక సిబ్బంది బృందాలుగా ఏర్పడి ట్రెయిన్డ్ డాగ్ స్క్వాడ్ సహాయంతో ప్రతి మండలంలోని ప్రధాన ప్రాంతాలలో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్న నేపథ్యం లో,ధర్మపురి పట్టణంలోని ప్రధాన కిరాణా దుకాణాలు,టీ స్టాళ్లు, పాన్ షాపులు, అనుమానాస్పద ప్రాంతాలలో ప్రత్యేక తనిఖీ చేస్తున్నారని,అందులో భాగంగా ధర్మపురిలో ప్రత్యేకతనిఖీ చేశామని తెలిపారు యువతకు ప్రత్యేక అవగాహన కల్పించారు.గంజాయి వంటి మాదక ద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని, ఆరోగ్యంతో పాటు కుటుంబ మరియు సామాజిక జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతాయని తెలిపారు.అలాంటి నిషేధిత పదార్థాలకు దూరంగా ఉండాలని,ఎవరైనా గంజాయి విక్రయాలు లేదా వినియోగం నిర్వహిస్తున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.జిల్లాలో మాదక ద్రవ్యాల నిర్మూల కోసం ప్రత్యేక నిఘా కొనసాగుతుందని,గంజాయి విక్రయాలు ,రవాణా లేదా వినియోగంలో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ జి.మహేశ్, పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

# హుజురాబాద్ మునిసిపాలిటీలో.. గందరగోళం!

**-కౌన్సిలర్లకు తెలియకుండానే అభివృద్ధి పనులకు తీర్మానాలు?**

**(కోరెం సుధాకర్ రెడ్డి చురకలు ప్రతినిధి హుజురాబాద్)**

హుజురాబాద్ మున్సిపాలిటీలో చైర్ పర్సన్, కౌన్సిలర్లకు మధ్య ఉన్న విభేదాలు అలాగే అధికారులకు కౌన్సిల్ కు మధ్య సమన్వయ లోపం తాజాగా బుధవారం జరిగిన కౌన్సిల్ సమావేశం లో బయటపడింది.ఇటీవలే మున్సిపల్ కమిషనర్గా బి కిషన్ బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ ఎన్నికలు ఫిబ్రవరిలో జరిగాయి. చైర్పర్సన్ గా అధికార పార్టీకి చెందిన ఆర్ సుహాసిని ఎన్నికయ్యారు. అప్పటినుండి కౌన్సిల్ జనరల్ బాడీ సమావేశాలు జరుగుతున్నాయి.అయితే తాజాగా జరిగిన సమావేశంలో అభివృద్ధి పనులకు తీర్మానాలు చేశారు. సుమారు నాలుగున్నర కోట్ల అభివృద్ధి పనులకు తీర్మానాలు చేసినట్టు తెలుస్తోంది. అయితే మున్సిపాలిటీలో మొత్తం 30 మంది కౌన్సిలర్లు ఉండగా 19 మంది కౌన్సిలర్లు తమకు తెలియకుండానే అభివృద్ధి పనులకు తీర్మానాలు చేశారని, దీన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామంటూ ప్రకటన విడుదల చేయడం స్థానికంగా సంచలనం సృష్టించింది. మున్సిపల్ చైర్ పర్సన్ ఆర్ సుహాసిని కార్యవర్గాన్ని సమన్వయ చేయలేకపోతున్నారనే విమర్శలు వస్తున్నాయి.నిజానికి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం లో మొదట కౌన్సిలర్లు హాజరైనట్టుగా రిజిస్టర్లు సంతకాలు తీసుకుంటారు. అలాగే తీర్మానాల కోసం రిజిస్టర్ లో మరో సంతకం కూడా తీసుకుంటారు. సమావేశం అనంతరం సభలో చేసిన తీర్మానాలను రాస్తారు. అయితే ఇక్కడ సమావేశంలో అభివృద్ధి పనులను వివరించారా? లేదా? తీర్మానిస్తున్నట్టుగా చెప్పారా లేదా? అన్నది తెలియాల్సి ఉంది. కానీ 19 మంది కౌన్సిలర్లు మాత్రం తమకు అభివృద్ధి పనుల తీర్మానాల విషయం తెలియదని చెప్తున్నారు. దీంతో



మునిసిపాలిటీలో గందరగోళ వాతావరణం ఏర్పడింది. కొత్త కార్యవర్గం ఏర్పడి కనీసం మూడు నెలలు కూడా గడవక ముందే మున్సిపాలిటీలో ఏం జరుగుతుందో కూడా తెలియని పరిస్థితి దాపురించింది. అభివృద్ధి పనుల తీర్మానాలు తమకు తెలియదని ప్రకటించిన కౌన్సిలర్లలో అధికార పార్టీ కాంగ్రెస్కు చెందిన కౌన్సిలర్లతోపాటు బిజెపి, బి ఆర్ ఎస్ కౌన్సిలర్లు కూడా ఉన్నారు.

**వైస్ చైర్మన్ గూడూరి అంజలి అలక?**

హుజురాబాద్ మునిసిపాలిటీ వైస్ చైర్మన్ గా గూడూరి అంజలి ఉన్నారు. ఈమె సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గూడూరి స్వామి రెడ్డికి స్వయంగా కోడలు. అయితే గతంలో జరిగిన మున్సిపాలిటీ సమావేశాల్లో వైస్ చైర్ పర్సన్ వేదిక మీదికి పిలిచినట్టు తెలుస్తోంది. కానీ తాజాగా బుధవారం జరిగిన సమావేశంలో మాత్రం ఆమెను వేదిక పైకి పిలవకపోవడం తో కినుక వహించినట్టు సమాచారం. తనకు మునిసిపాలిటీ కార్యక్రమాల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వడంలేదని ఆమె ఆరోపిస్తున్నట్టు తెలుస్తోంది.అలాగే పరిపాలనకు సంబంధించిన తీర్మానాలు విషయాలు కూడా తెలపడం లేదని ఆమె మండిపడుతున్నట్టు సమాచారం. ఇదిలా ఉంటే మునిసిపల్ చైర్పర్సన్ ఆర్ సుహాసిని కేవలం వార్డులను సందర్శించడం ఫోటోలు దిగడం తప్ప పెద్దగా పనిచేయడం లేదని అభిప్రాయం అటు కాంగ్రెస్ పార్టీలో ఇటు కౌన్సిలర్లలో వ్యక్తం అవుతోంది. ఆమె తీరుపై కూడా మెజార్టీ కౌన్సిలర్లు అసంతృప్తిగా ఉన్నట్టు సమాచారం. అయితే తీర్మానాలు తమకు తెలియదని సంతకాలు చేసిన వారిలో కాంగ్రెస్ బిజెపి బిఆర్ఎస్ సభ్యులు కూడా ఉండడం గమనార్హం. మునిసిపల్ కౌన్సిల్లో విభేదాలు ఎలాంటి పరిణామాలకు దారితీస్తాయోననే చర్చ స్థానికంగా జరుగుతోంది. ఐదేళ్ల కాలానికి సమన్వయంతో నడవాల్సిన కౌన్సిల్ మూడు నెలలకే విభేదాలతో సతమతం కావడం గమనార్హం.

## ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం



**చురకలు విలేకరి, గొల్లపల్లి, మే 29 :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వరి, మొక్కజొన్న కొనడం లో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం అయిందని బిఆర్ఎస్ యూత్ నాయకుడు అవారి చందు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎలాంటి కటింగ్ లేకుండా వడ్లు కొనుగోలు చేస్తామని మోసపూరిత హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం, గద్దెనెక్కిన తరువాత కటింగ్ లేపోవడం దేవుడెరుగు క్వింటాలుకు 7,8 కిలోలు కట్ చేస్తూ రైతులను ఇబ్బంది పెడుతుందన్నారు. గత ప్రభుత్వంలో బస్తాకు కిలోన్నర కట్ చేస్తేనే విమర్శలు చేసిన సీఎం రేవంత్రెడ్డి ఇప్పుడు క్వింటాలు కు 7,8 కిలోలు ఎలా కట్ చేస్తున్నారని విమరి ?శంచారు. వరి వేస్తే కేంద్ర ప్రభుత్వం కొనడం లేదని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం వరి, మక్కలు వేస్తే వాటిని కొనుగోలు చేసే నాథుడే లేడన్నారు వచ్చే ఖరీఫ్ నుంచి సన్నలు మాత్రమే సాగు చేయాలని చెప్పడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా రైతుల పొట్ట కొట్టకుండా పండించిన ధాన్యం కొనుగోలు చేయాలని, రైతులకు ప్రభుత్వం పై తీవ్రమైన వ్యతిరేకత వచ్చిందని యువత నాయకులు అవారి చందు పేర్కొన్నారు.

## పదవి విరమణ సన్మానం



**చురకలు విలేకరి, జగిత్యాల, మే 29 :** కళాశ్రీ ఈశ్వరమ్మ సాహిత్య పీఠం జగిత్యాల అధినేత గుండేటి రాజు ఆధ్వర్యంలో సంస్థ ప్రధాన అడ్మిన్, ఉపాధ్యాయురాలు, కవయిత్రి మద్దెల సరోజన గంగారాం పదవి విరమణ కార్యక్రమం స్థానిక దేవిశ్రీ గార్డెన్స్ లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉద్యోగ పర్వంలో పదవి విరమణ తప్పదని, శేష జీవితం ఆనందంగా, సమాజ హితంగా జీవించాలని పిఆర్టియూ జిల్లా అధ్యక్షుడు బి.ఆనందరావు కొనియాడారు.ఈ కార్యక్రమంలో టి.వి.సూర్యం,ఉపాధ్యాయ సంఘ నాయకులు అమర్నాథ్ రెడ్డి, అలిశెట్టి రాజు, భోనగిరి దేవయ్య,కవయిత్రులు అయిత అనిత, కటుకం కవిత, లక్కరాజు శ్రీలక్ష్మి, రుద్రంగి కమల,మద్దెల ప్రభాకర్, రుద్రంగి గోపాలకృష్ణ, సరళ, శ్రీనివాస్ చారి తదితరులు పాల్గొన్నారు.

## సమతుల్య ఆహారంతో చిన్నారుల ఆరోగ్యానికి మేలు



**చురకలు విలేకరి, మెట్పల్లి రూరల్, మే 29 :** సమతుల్య ఆహారం తల్లి మరియు శిశువు ఆరోగ్యానికి చాలా అత్యవసరమని అంగన్వాడీ సూపర్వైజర్ హేమలత అన్నారు. శుక్రవారం మండలంలోని చింతలపేట్ గ్రామాల్లో తెలంగాణ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమంలో భాగంగా మహిళా వారోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు సూపర్వైజర్ హేమలత గర్భిణీ బాలింతలతో మాట్లాడుతూ ప్రారంభ బాల్య విద్య మరియు శిశువు మొదటి 1000 రోజుల ప్రాముఖ్యతను గురించి వారికీ వివరించారు. గర్భధారణ నుండి రెండు సంవత్సరాల వరకు పిల్లల అభివృద్ధి అత్యంత కీలకమని సమతుల్య ఆహారం తల్లి మరియు శిశువు ఆరోగ్యానికి అత్యవసరమని తల్లిపాల ప్రాధాన్యత గురించి సూచించారు.పిల్లల ఎత్తు, బరువు, శారీరక, మానసిక మరియు సామాజిక అభివృద్ధి వివరించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి గ్రామ సర్పంచ్ చిన్నయ్య, అంగన్వాడి టీచర్ అరుణ, గర్భిణీలు ,బాలింతలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

**-తడిసిన ధాన్యం సేకరణకు రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు**
**-కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**-తంగళ్ళపల్లి మండలం అంకుసాపూర్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్**



**చురకలు ప్రతినిధి సిరిసిల్ల మే 29** : తడిసిన ధాన్యం సేకరణ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని,రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు.తంగళ్ళపల్లి మండలం అంకుసాపూర్ గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని క్షేత్ర స్థాయిలో సందర్శించారు.ఇప్పటివరకు సేకరించిన ధాన్యం,తూకం వేసి తరలించడానికి సిద్ధంగా ఉన్న బస్తాల వివరాలను కొనుగోలు కేంద్రం నిర్వాహకులను అడిగి ఆరా తీశారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఈ సారి వరి దిగుబడి, కొనుగోలు కేంద్రాలకు రాక పెరిగిందని, జిల్లాలో నిన్నటివరకు 2 లక్షల 33 వేల 758 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఇప్పటి దాకా 80 శాతం కొనుగోలు చేశామని తెలిపారు. డీఆర్డీఓ, సహకార శాఖ, మెప్మా, పౌర సరఫరాల శాఖ, రవాణా శాఖ ఇతర శాఖల అధికారుల సమన్వయంతో కొనుగోలు తుది దశకు చేరుకున్నాయని వెల్లడించారు. కొనుగోలు కేంద్రాలు ధాన్యం,గోదాముల్లో ధాన్యం అన్ లోడింగ్ వేగంగా పూర్తి చేసేలా మండలాలకు ప్రత్యేక అధికారులు, అన్ లోడింగ్ వద్ద అధికారులను నియమించి పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు. కొనుగోళ్ల ప్రక్రియ పై ప్రతి రోజు ఉదయం అన్ని శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేస్తూ.. కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ వెల్లడించారు.సిరిసిల్ల, తంగళ్లపల్లి మండలాల్లో కొంత వర్షం కురిసిందని, దీంతో తాను తంగళ్ళపల్లి మండలం అంకుసాపూర్ గ్రామంలోని కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించానని పేర్కొన్నారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించాలని పౌర సరఫరాల శాఖ అధికారిని ఆదేశించారు.రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అపరల్ పార్క్,గోదాములకు తరలించి అక్కడ అన్ లోడింగ్ చేయిస్తున్నామని, హమాలీలకు నీరు,ఆహారం అన్ని వసతులు కల్పిస్తున్నామని తెలిపారు.వర్షం కారణంగా తడిసిన ధాన్యం సేకరణ విషయంలో ఇబ్బందులు లేవని,రైతులు ఈ విషయంలో ఆందోళన చెందవద్దని కలెక్టర్ సూచించారు.తూకం వేసి ఉన్న ధాన్యం బస్తాలను తరలించడానికి వాహనాలను సమకూర్చాలని ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లను ఆదేశించారు.అన్ని శాఖల సమన్వయంతో జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా సాగుతుందని,సాధ్యమైనంత త్వరగా కొనుగోళ్ళు పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటు న్నామని తెలిపారు.పరిశీలనలో జిల్లా సహకార అధికారి రామకృష్ణ,జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# సత్సంగసధనంలో అత్యంత వైభవంగా శ్రీధర్మరాజు పట్టాభిషేకం

**-ధర్మం వైపే పరమాత్మ**
**-శ్రీ శ్రీ శ్రీ సరస్వతి గోవిందరాజులు నాటిన బీజం నేడు మహావృక్షమైంది**
**-బ్రహ్మశ్రీ డాక్టర్ గర్రెపల్లి మహేశ్వరశర్మ**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట మే 29** : ఎల్లారెడ్డిపేటమండల కేంద్రంలోని సత్సంగ సదనం శ్రీశ్రీ శ్రీ సరస్వతీ గోవిందా రాజుల చారి టేబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం అత్యంత వైభవంగా శ్రీధర్మరాజు పట్టాభిషేకం జరిగింది.శ్రీ ధర్మరాజు పట్టాభిషేకాన్ని వేములవాడ పురోహితులు ఆదిత్య శర్మ శరత్ శర్మలు కన్నుల పండగ గా నిర్వహించారు,ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సత్సంగ సదనం శ్రీశ్రీ శ్రీ సరస్వతీ గోవిందా రాజులచారి టేబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ నుండి 28వతేదీ వరకు శ్రీ మహాభారత జ్ఞాన యజ్ఞంను శ్రీశృంగేరి శారద పీఠ ఆస్థాన పౌరాణికులు బ్రహ్మశ్రీ డాక్టర్ గర్రెపల్లి మహేశ్వర శర్మ కన్నులకు కట్టినట్టుగా మహాభారతాన్ని భక్తులకు బోధించారు,పరమాత్మ ధర్మం వైపు నిలిచారని మనమంతా ధర్మం వైపు పయనించాలనీ ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రజలకు ఎటువంటి అన్యాయం జరగకుండా ధర్మబద్ధమైన పాలన అందించాడన్నారు, పురుషోత్తం మాసం సందర్భంగా తోమ్మిది రోజుల పాటు మహాభారత జ్ఞాన యజ్ఞంను నిర్వహించిన మహేశ్వరశర్మను వారి తల్లిదండ్రులను సత్సంగ సదనం శ్రీశ్రీ శ్రీ సరస్వతీ గోవిందా రాజుల చారి టేబుల్ ట్రస్ట్ అద్యక్షులు బ్రహ్మాచారి లక్ష్మారెడ్డి,కార్యదర్శి నగుబోత్ శ్రీనివాస్ గుప్తా దంపతులు భూపతిసారు గంప నాగేంద్రగుప్తా దంపతులు, రామ్ రెడ్డి సార్ ద్యాప దేవయ్య యాదవ్‌లు దుబ్బ విశ్వనాథం మేఘ నరసయ్య , రమేష్ బండారి బాల్ రెడ్డి పోతు ఆంజనేయులు దంపతులు వేణుగోపాల్‌స్వామి గోదాగోష్టి మహిళాభక్త బృందం,శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమం లో గ్రామ పురోహితులు బ్రహ్మశ్రీ రాచర్ల దయానంద శర్మ ఇందిరా రాణి దంపతులు కామారెడ్డి శ్రీకృష్ణ ఆశ్రమ నిర్వాహకులు శ్రీ కృష్ణానంద స్వామి గుండం రాజిరెడ్డి అనంతరెడ్డి కిషన్ రెడ్డి,నగుబోతు రాము గుప్తా బొమ్మ కంటీ రాజేశం గుప్త బొమ్మకంటి రాజయ్య గుప్తా లక్ష్మీనారాయణ గుప్తా ,మహిళా ప్రతినిధులు పద్మక్క అంజమ్మ గ్రామానికి చెందిన మహిళా భక్తులు గ్రామస్తులు గోషిక దాసు,గన్న పద్మారెడ్డి గుండారం రవీందర్రావు,పోతు ఆంజనేయులు వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు.పాల్గొన్న భక్త కోటికి మహేశ్వర్ శర్మ చేతుల మీదుగా లడ్డు ప్రసాదాన్ని పంపిణీ చేశారు అనంతరం అన్న ప్రసాద వితరణ జరిగింది.

# సిరిసిల్ల 27వ వార్డు కౌన్సిలర్ కాసర్ల పద్మ గుండెపోటుతో మృతి

**-భౌతిక దేహానికి నివాళు లర్పించిన ఎమ్మెల్యే కేటీఆర్**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట మే 29** : సిరిసిల్ల పట్టణంలోని 27వ వార్డుకు చెందిన బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ కాసర్ల పద్మ అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆసుపత్రిలో శుక్ర వారం ఉదయం గుండెపోటుతో మరణించింది,మరణ వార్త విని వారి కుటుంబ సభ్యులు బంధుమిత్రులువార్డు ప్రజలు బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు శోకసముద్ర మయ్యారు,దీంతో ఆ వార్డులో విషాదం చోటుచేసుకుంది ఈ మరణ వార్తను మున్సిపల్ చైర్మన్ జిందం కళాచక్రపాణి బిఆర్ఎస్ పార్టీ సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌కు తెలియ జేశారు.ఆయన వస్తున్నట్లు చెప్పడంతో బాడీ ఫ్రీజర్‌లో పద్మ భౌతిక దేహాన్ని భద్రపరిచారు,కేటీఆర్ శుక్రవారం మధ్యాహ్నం సిరిసిల్ల చేరుకొని కాసర్ల పద్మ భౌతిక దేహాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు ఆమె భౌతిక దేహంపై బిఆర్ఎస్ పార్టీ జెండా ను కప్పి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.పద్మ కుటుంబ సభ్యులను దగ్గరికి తీసుకొని ఓదార్చారు ధైర్యంగా ఉండాలని వారికి సూచించారు.ఆమే ఇటీవల మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్‌గా బిఆర్ఎస్ పార్టీ నుండి 27వ వార్డు నుండి ఘన విజయం సాధించింది.కేటీఆర్ వెంట మున్సిపల్ చైర్మన్ జిందం కళా చక్రపాణి బిఆర్ఎస్ పార్టీ జిల్లా అద్యక్షులు తోట ఆగయ్య బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు, వివిధ హోదలో ఉన్న పార్టీ నాయకులు మున్సిపల్ అధికారులు వివిధ పార్టీ ల నాయకులు ఉన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ మే 29** : మంథని మండలం కన్నాల గ్రామంలోని ఊర చెరువులో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పూడికతీత పనులు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు కన్నాల గ్రామపంచాయతీ తరపున కన్నాల గ్రామ సర్పంచ్ గుడిసె గట్టయ్య యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగింది.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా ఉపాధి హామీ కూలీలు వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గాదె దివ్య సంజీవరెడ్డి సీనియర్ కాంగ్రెస్ నాయకులు కావటి సందీప్ యాదవ్ పంచాయతీ కార్యదర్శి మధుకర్ ఫీల్డ్ అసిస్టెంట్ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మంత్రికి ముందస్తు శుభాకాంక్షలు తెలిపిన నాయకురాలు



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ మే 29** : రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు ముందస్తు పుట్టినరోజు శు భాకాంక్షలు కాంక్షలు సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు జాగిరి రజిత తెలిపారు.రామగిరి మండలం పన్నూరు గ్రామానికి చెందిన జాగిరి రజిత తెలంగాణ రాష్ట్ర ఐటీశాఖ మంత్రివర్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబును మంథని నియోజక వర్గంలోని కాటారం మండలం ధన్వాడలో కలిసి శాలువతో సత్కరించి ముందస్తు శుభాకాంక్షలు రజిత తెలియజేశారు.

## పైప్ కల్వర్ట్ పనులు ప్రారంభించిన సర్పంచ్ సంపత్



**చురకలు విలేఖరి వీణవంక మే 29** : వీణవంక మండల పరిధిలోని బొంతుపల్లి గ్రామంలో శుక్రవారం పైప్ కల్వర్టు పనులను సర్పంచ్ బావు సంపత్,ఉప సర్పంచ్ చదువు నర్సింహా రెడ్డి కలసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గ్రామంలోని వివిధ అభివృద్ధి పనులకు గాను నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరగా గత సంవత్సరంలో ఎనిమిది లక్షలు మంజూరు చేయడం జరిగింది.ఈ కల్వర్ట్ రైతులకు 60.ఎకరాల వ్యవసాయ భూములకు వెళ్లడానికి ఉపయోగ పడుతుందనీ తెలిపారు.మాజీ ఉప సర్పంచ్ చదువు జితేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కే రజిత,కాంగ్రెస్ నాయకులు చదువు జైపాల్ రెడ్డి, రైతులు తాటికొండ గోవిందా చారి,రమేష్, పొన్నాల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యాయామ సాధకుడు ఏ ఎక్కేటి అనంతరెడ్డి



**మంథని,మే 29 (చురకలు ప్రతినిధి)** : మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కేటి అనంతరెడ్డి ప్రతినిత్యం వ్యాయామం చేస్తూ పదిమందికి ఆదర్శంగా నిలుస్తున్నారు.ప్రతిరోజు మంథని జూనియర్ కళాశాల మైదానంలో సుమారు గా 10రౌండ్లు సైక్లింగ్ చేయడమే కాకుండా వ్యాయామం చేస్తూ మైదానానికి వచ్చే వారికి ఉత్సాహాన్ని నింపుతున్నారు.ఆహ్లాదకరమైన వాతావరణంలో వాకర్స్ కు పలు సూచనలు చేస్తూ తనదైన ముద్ర వేస్తున్నారు.రాజకీయ ఉద్దండుడిగా పేరుగాంచిన అనంతరెడ్డి తన అనుభవాన్ని వాకర్స్‌తో పంచుకుంటూ ఆరోగ్యంగా ఉండాలని సూచిస్తున్నారు.

# జిల్లా కలెక్టర్‌కు హుజురాబాద్ నియోజకవర్గ సమస్యలపై వినతి

**- ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**



**చురకలు విలేఖరి వీణవంక మే 29 :** హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఈరోజు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా హుజురాబాద్ పట్టణం,జమ్మికుంట పట్టణం సహా నియోజకవర్గంలోని హుజురాబాద్ జమ్మికుంట వీణవంక ఇల్లందకుంట కమలాపూర్ ఐదు మండలాల్లో నెలకొన్న తీవ్రమైన తాగునీటి సమస్యపై ఎమ్మెల్యే ప్రత్యేకంగా దృష్టి సారించారు.వేసవి తీవ్రతతో ప్రజలు నీటికోసం ఇబ్బందులు పడుతున్నారని,వెంటనే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి ప్రతి గ్రామానికి,ప్రతి కాలనీకీ తాగునీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన దళితబంధు పథకం రెండో విడతను త్వరితగతిన ప్రారంభించి అర్హులైన లబ్ధిదారులకు అందించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.పేద కుటుంబాలకు ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని,ఆలస్యం చేయకుండా అమలు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.నియోజకవర్గ అభివృద్ధికి కీలకమైన వీణవంక మండల కేంద్రంలోని డబుల్ రోడ్డు,రాచపల్లి రోడ్డు, పోతిరెడ్డిపల్లి రోడ్డు, కోర్కల్ రోడ్డు, నాగంపేట రోడ్ల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.ఈ రోడ్ల దుస్థితి కారణంగా ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.రైతులు పండించిన మక్కజొన్న కొనుగోళ్లలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే కోరారు. కొనుగోలు కేంద్రాల్లో సరైన సౌకర్యాలు కల్పించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలిపారు.అదేవిధంగా డబల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీని పూర్తిగా పారదర్శకంగా నిర్వహించి నిజమైన అర్హులైన పేదకుటుంబాలకు అందజేయాలని కోరారు.ఇందిరమ్మ ఇళ్ల పథకంలో కూడా రాజకీయాలకు అతీతంగా నిజమైన పేదలను గుర్తించి ఎంపిక చేయాలని సూచించారు. హుజురాబాద్ పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న పలు స్థానిక సమస్యలను కూడా కలెక్టర్‌కు వివరించిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

# నిర్వాసితులందరికీ న్యాయం జరిగేలా చూస్తాం

**-భూనిర్వాసితుల సమస్య పరిష్కారానికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవ**
**-సచివాలయంలో జెన్‌కో సీఎండీ, అధికారులతో సమావేశం ఏర్పాటు**
**-రూ.261 కోట్ల మంజూరుపై హర్షం వ్యక్తం చేసిన : కేసారపు రవి**



**మంథని, చురకలు ప్రతినిధి, మే 29 :** మల్హర్ రావు మండలం తాడిచర్ల గ్రామంలోని జెన్‌కో భూనిర్వాసితులందరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తున్నామని తాడిచర్ల కాపురం గ్రామాల జెన్‌కో భూనిర్వాసిత హక్కుల సాధన పోరాట కమిటీ అధ్యక్షుడు కేసరపు రవి తెలిపారు.డేంజర్ జోన్‌లో నివసిస్తున్న ప్రజలకు కేవలం 1088ఇండ్లకే నష్టపరిహారం వస్తుందనే విషయంలో ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదని,అందువల్ల నిర్వాసితులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక భూనిర్వాసితులందరికీ న్యాయం జరగాలనే ఉద్దేశంతో తెలంగాణ హైకోర్టులో కేసు వేయడంతో పాటు హ్యూమన్ రైట్స్ కమిషన్, లోకాయుక్త, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) వంటి వివిధ సంస్థల్లో కూడా కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా ప్రధానమంత్రి కార్యాలయానికి లేఖలు పంపి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చామని పేర్కొన్నారు. తెలంగాణ హైకోర్టులో కేసు వేయడం వల్లే ప్రభుత్వం మీద ఒత్తిడి పెరిగి,భూనిర్వాసితులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు రూ.261 కోట్లు మంజూరయ్యాయని కేసరపు రవి హర్షం వ్యక్తం చేశారు.డేంజర్ జోన్ నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరుతూ గ్రామంలోని మహిళలు చేపట్టిన ధర్నా ఉద్యమం కూడా ప్రభుత్వ దృష్టిని ఆకర్షించిందన్నారు.గ్రామ మహిళలు ధైర్యంగా పోరాటం చేయడంతో సమస్య మరింత వేగంగా ప్రభుత్వ దృష్టికి వెళ్లిందని పేర్కొన్నారు.ఈ సమస్య పరిష్కారంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవ తీసుకున్నారని కొనియాడారు.తాడిచర్ల గ్రామ భూనిర్వాసితుల సమస్యలపై హైదరాబాద్‌లోని సచివాలయంలో జెన్‌కో సీఎండీతో పాటు వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి గ్రామ ప్రజల సమస్యలను స్వయంగా విన్నారని తెలిపారు.గ్రామ సర్పంచ్ బండి స్వామి,ఉపసర్పంచ్ బొబ్బిలి రాజుతో కలిసి భూనిర్వాసితులను సచివాలయానికి తీసుకెళ్లి సమావేశం ఏర్పాటు చేయడంలో మంత్రి శ్రీధర్ బాబు చూపిన చొరవ అభినందనీయమని పేర్కొన్నారు. భూనిర్వాసితుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తున్న మంత్రి శ్రీధర్ బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు.అదేవిధంగా గ్రామ సర్పంచ్ బండి స్వామి, ఉపసర్పంచ్ బొబ్బిలి రాజు కూడా నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కీలకంగా వ్యవహరించారని కేసరపు రవి తెలిపారు.గ్రామంలో మహిళలు చేపట్టిన ధర్నా సందర్భంగా వారికి నచ్చజెప్పి ఆందోళన విరమింపజేసి,బాధ్యత తీసుకుని మంత్రి శ్రీధర్‌బాబు వద్దకు తీసుకెళ్లి సమావేశం ఏర్పాటు చేయించినందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ తరఫున జిల్లా కలెక్టర్‌కు స్థానిక ఎమ్మార్వో రవికుమార్ సమర్పించిన అఫిడవిట్‌లో డేంజర్ జోన్‌లో నివసిస్తున్న గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నట్లు కేసరపు రవి వివరించారు. భద్రతా కారణాల దృష్ట్యా జెన్‌కో సంస్థ నుంచి నిధులు ఎంత త్వరగా విడుదలైతే అంత త్వరగా డేంజర్ జోన్‌లో నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామని ఆ అఫిడవిట్‌లో పేర్కొన్నట్లు తెలిపారు.అదేవిధంగా 2020 నుంచి 2023-24 వరకు జెన్‌కో అధికారులు,జిల్లా కలెక్టర్ మధ్య జరిగిన లేఖల సారాంశం,జిరాక్స్ ప్రతులను కూడా హైకోర్టుకు సమర్పించినట్లు వెల్లడించారు.తెలంగాణ స్టేట్ హ్యూమన్ రైట్స్ కమిషన్‌లో దాఖలు చేసిన కేసులో కూడా జెన్‌కో సంస్థ కౌంటర్ దాఖలు చేసి, గ్రామస్తులు డేంజర్ జోన్‌లోనే నివసిస్తున్నారని అంగీకరించిందన్నారు. వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సిన అవసరం ఉందని జెన్‌కో తమ కౌంటర్‌లో పేర్కొన్నట్లు తెలిపారు.ఈ కేసుకు సంబంధించి జూన్ 3న తదుపరి విచారణ జరగనుందని కేసరపు రవి స్పష్టం చేశారు.

# బిజిగిరి దర్గాను అభివృద్ధి చేస్తాం : కాంగ్రెస్ నేత వొడితల ప్రణవ్

**చురకలు ప్రతినిధి హుజురాబాద్ మే 29 :** జమ్మికుంట మండల పరిధిలోని బిజిగిరి షరీఫ్ దర్గాలో ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన బిజిగిరి షరీఫ్ దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం చాధర్ సమర్పించారు. దర్గా కమిటీ ప్రతినిధులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. బిజిగిరి దర్గా పై భక్తులకు ఎంతో విశ్వాసమని జిల్లా నుండే కాక ఇతర ప్రాంతాల నుండి భక్తులు వచ్చి ఈ దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని, దర్గాను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ప్రణవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ



సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## బుగ్గ ఆలయ హుండీ లెక్కింపు



**చురకలు ప్రతినిధి, మంచిర్యాల, మే 29 :** బెల్లంపల్లి మండలం లోని కన్నాల శ్రీ బుగ్గ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం లో గత మూడు నెలలుగా భక్తుల నుండి సమకూరిన హుండీ ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. దేవస్థాన ఈవో గుర్రాల బాపురెడ్డి, మంచిర్యాల ఈవో రవి ల సమక్షంలో హుండీని లెక్కించగా రూ 19 వేల 8 వందల 61 రూపాయల ఆదాయం సమకూరింది. హుండీ లెక్కింపు కార్యక్రమంలో కన్నాల వార్డు సభ్యులు భావండ్ల పల్లి భరత్ కుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ప్రతిపాదిత చైర్మన్ మహేష్ కుమార్, అర్చకులు శ్రీరాం పట్ల వేణుగోపాల శర్మ, కూరెళ్ళి సతీష్ శర్మ, క్లర్క్ భాను తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహిళా వారోత్సవాలు

**-రూ 8 కోట్ల 11 లక్షల 25 వేల చెక్కు పంపిణీ**



**చురకలు ప్రతినిధి, మంచిర్యాల, మే 29 :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ,జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆదేశాలతో బెల్లంపల్లి మండల సమాఖ్య ఆధ్వర్యంలో బెల్లంపల్లి మండల పరిషత్ కార్యాలయంలో మహిళా వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు.ఇందులో భాగంగా 71స్వయం సహాయక సంఘాలకు రూ 8 కోట్ల 11లక్షల 25వేల రూపాయల తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రుణాలకు సంబంధించిన చెక్కును పంపిణీ చేశారు.మేకల పెంపకం (ఎన్ ఆర్ ఎల్ ఎం) కింద రూ 4 లక్షలు,వరి ధాన్యం కొనుగోలు చేసిన గ్రామ సంఘాలకు సేవా రుసుము కింద రూ లక్ష18 వేల 119లను చెక్కు రూపంలో అందించారు. బెల్లంపల్లి మండలంలో గ్రామ సంఘాల భవనాల ను నిర్మించిన సర్పంచులను సన్మానించారు.ఉత్తమంగా నిలిచిన గ్రామ సంఘాల బాధ్యులను, సభ్యులను సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మహేందర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కారుకూరి రాంచందర్,నాతరి స్వామి,బత్తిని రవి,ఏపీఎం విజయలక్ష్మి,మండల సమాఖ్య కార్యవర్గ సభ్యులు,కమ్యూనిటీ కోఆర్డినేటర్లు,మహిళాస్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## వివోఏల సమ్మెకు బీఆర్ఎస్ నాయకుల మద్దతు



**చురకలు ప్రతినిధి,మంచిర్యాల, మే 29 :** బెల్లంపల్లి ఎంపీడీవో కార్యాలయం ఎదుట వివోఏలు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెకు శుక్రవారం బి ఆర్ ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. వివో ఏ లకు రూ 20 వేల కనీస వేతనం అందించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. హెచ్ ఆర్ పాలసీ అమలు చేయడంతో పాటు జీవో నెంబర్ 58 ని సవరించాలని డిమాండ్ చేశారు. సాధారణ భీమా సౌకర్యాన్ని రూ 20 లక్షల వరకు కల్పించాలని కోరారు. సమ్మెకు మద్దతు ప్రకటించిన వారిలో బెల్లంపల్లి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, మాజీ కౌన్సిలర్ రామకృష్ణ, ప్రస్తుత బీఆర్ ఎస్ కౌన్సిలర్లు సల్ల కృష్ణవేణి, తాండ్ర స్రవంతి, గోగర్ల స్వప్న, తిరుమల వాసు, ఈత రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# రియల్ మాఫియా నుండి ఎర్ర గుంట చెరువును కాపాడాలి



**చురకలు ప్రతినిధి, మంచిర్యాల, మే 29 :** బెల్లంపల్లి మండలం లోని కన్నాల గ్రామపంచాయతీ పరిధిలో గల ఎర్రకుంట చెరువు ను రియల్ ఎస్టేట్ మాఫియా నుండి కాపాడి రైతులకు, మత్స్యకారులకు న్యాయం చేయాలని ఐ ఎఫ్ టి యు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండి చాంద్ పాషా, రాష్ట్ర సింగరేణి గని కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు అంబాల మహేందర్, ఏ ఐఎఫ్టియు రాష్ట్ర కార్యదర్శి ఎం. పోషమల్లు లు శుక్రవారం డిమాండ్ చేశారు. వారు ఎర్రగుంట చెరువును పరిశీలించిన అనంతరం మాట్లాడారు. గతంలో ఈ చెరువులో జరుగుతున్న అక్రమాలపై జిల్లా కలెక్టర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ కు ఫిర్యాదు చేశామన్నారు.చెరువు పునరుద్ధరణ పనుల కోసం జిల్లా అధికారులు ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ఆరు నెలల కిందట ఇరిగేషన్ అధికారులు తాత్కాలికంగా ఇసుక బస్తాలు వేసి గండిని పూడ్చారని చెప్పారు.గత రెండు వారాల కిందట చెరువు సమస్యను ప్రజావాణిలో సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చినట్లు చెప్పారు.దీంతో ఎర్రగుంట చెరువు మరమతుల కోసం బడ్జెట్ కేటాయించినట్లు తెలిపారు. ఎర్రకుంట చెరువు కట్ట,గండి పూడ్చకుండా మట్టిని తీయడం సరైనది కాదని వారు పేర్కొన్నారు. సారవంతమైన మట్టితో కట్టను నిర్మించాలని కోరారు. ఎఫ్టిఎల్ లెవెల్ వరకు డెప్త్ చేయించి మత్స్యకారులకు ఉపయోగపరంగా ఉండే విధంగా పనులు చేపట్టాలని కోరారు. నామమాత్రంగా పనులు చేపట్టి చేతులు దులుపుకోవాలని డిమాండ్ చేశారు. చెరువు తూములను నాణ్యతగా నిర్మించి నీరు అందించాలని వారు డిమాండ్ చేశారు.

# మాల వాగు వరద ముంపు సమస్యను తక్షణమే పరిష్కరించాలి

### - కలెక్టరేట్‌లో కన్నీటి పర్యంతమైన వెంకటాపురం 8వ వార్డు బాధితులు





**చురకలు ప్రతినిది ఎల్లారెడ్డి పేట మే 29 :** ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపురం గ్రామం 8వ వార్డులోని 'మాల వాగు' పూడికతీత పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని కోరుతూ శుక్రవారం నాడు గల్లీ ముంపు బాధితులు జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ ని కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. గత వానాకాలంలో మాలవాగు నీరు వెనక్కి తన్నడం వల్ల తమ ఇళ్లు, గుడిసెలు మోకాళ్లలోతు నీటిలో మునిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. తిండి గింజలు కుళ్లిపోయి, సామాన్లు కొట్టుకుపోయి చిన్న పిల్లలతో రాత్రంతా రోడ్లపైనే గడిపామని, పక్కనే ఉన్న రైతుల పొలాలు కూడా పూర్తిగా నీట మునిగి తీవ్రంగా నష్టపోయామని కలెక్టర్ గారికి వివరించారు. మళ్లీ వానాకాలం ముంచుకొస్తుండటంతో గల్లీ ప్రజలంతా నిద్రలేని రాత్రులు గడుపుతున్నామని,ఆకాశంలో చిన్న మబ్బు పట్టినా భయంతో వణికి పోతున్నామని కన్నీటి పర్యంతమయ్యారు .తాము పడిన నష్టాల ప్రత్యక్ష సాక్ష్యాలైన ముంపు ఫొటోలను, గల్లీ ప్రజలందరి సంతకాల పట్టికను కలెక్టర్ గారికి చూపిస్తూ తమను ఈ వరద గండం నుండి కాపాడాలని వేడుకున్నారు. దీనిపై కలెక్టర్ గారు సానుకూలంగా స్పందించి,సమస్యను పరిశీలించి త్వరలోనే పూడికతీత పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం 8వ వార్డు ముంపు బాధితులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యువత నైపుణ్యాభివృద్ధి ఎంతో అవసరం



### -ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**చురకలు ప్రతినిధి,జయశంకర్ భూపాలపల్లి, మే 29 :** యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం నైపుణ్య అభివృద్ధి ఎంతో అవసరమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు.టాస్క్ (టి ఏ ఎస్ కె) కోర్సును విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు.ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ యువతకు నైపుణ్యాభివృద్ధి ఎంతో అవసరమని,ఇటువంటి కోర్సులు విద్యార్థుల భవిష్యత్తుకు దోహదపడతాయని తెలిపారు.విద్యార్థులు నేర్చుకున్న నైపుణ్యాలను ఉపయోగించుకుని మంచి అవకాశాలను సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు సాంకేతిక విద్యతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య , చల్లూరి మధు, దాట్ల శ్రీనివాస్ పలువురు స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ కళాశాలలో కొనసాగుతున్న వెబ్ కౌన్సిలింగ్ సర్టిఫికెట్ వెరిఫికేషన్



**చురకలు ప్రతినిధి, మంచిర్యాల, మే 29 :** బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నాలుగు రోజుల వెబ్ కౌన్సిలింగ్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతుంది. శుక్రవారం మంచిర్యాల డీఈవో యాదయ్య ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాలిటెక్నిక్ ప్రవేశాల కోసం హాజరైన విద్యార్థుల సర్టిఫికెట్లను కళాశాల సిబ్బంది పరిశీలిస్తున్నారు. నాలుగవ తరగతి నుండి పదవ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, ట్రాన్స్ఫర్ సర్టిఫికెట్ (టి సి), పదవ తరగతి మెమో, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం తదితర సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేస్తున్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ అనంతరం బ విద్యార్థులు, తల్లిదండ్రులకు వెబ్ ఆప్షన్ విధానం, పాలిటెక్నిక్ కళాశాలల వివరాలు, కోర్సులు ఫీజు నిర్మాణం, హాస్టల్ వసతులపై బ్రీఫింగ్ ఆఫీసర్ అవగాహన కల్పించారు. వెబ్ ఆప్షన్ ఇంచార్జ్ విద్యార్థుల ర్యాంకు, వివిధ కళాశాల కోర్సులను ప్రాధాన్యత క్రమంలో నమోదు చేసి ఆప్షన్ ఎక్సర్సైజ్ నిర్వహిస్తున్నారు. దీని ద్వారా విద్యార్థులకు తగిన కళాశాలలో తగిన కోర్సులు సీటు పొందే అవకాశం కల్పించబడుతుందని చెబుతున్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్, బ్రీఫింగ్, వెబ్ ఆప్షన్ ఎక్సర్సైజ్ అనే మూడు ప్రక్రియలు బెల్లంపల్లి పాలిటెక్నిక్ హెల్ప్ లైన్ సెంటర్ లో కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో ఎం ఈ ఓ మహేశ్వర్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.దేవేందర్, బ్రీఫింగ్ ఆఫీసర్ బి .వెంకటేశ్వర్లు, కౌన్సిలింగ్ ఇన్చార్జి టి.మధుకర్, వెబ్ ఆప్షన్ ఇంచార్జి బి. శ్రీనివాస్ తో పాటు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### -మెట్పల్లి సీఐ సురేష్ బాబు




**చురకలు విలేకరి,మెట్‌పల్లి, మే 29 :** మెట్‌పల్లి సర్కిల్ పరిధిలో స్వర్ణకారులు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మెట్ పల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సురేష్ బాబు అన్నారు.ఇటీవల మెట్ పల్లి సీఐగా పదవీ బాధ్యతలు స్వీకరించిన సురేష్ బాబును పట్టణంలోని సీఐ కార్యాలయంలో మెట్ పల్లి వెండి, బంగారు వర్తక సంఘం అధ్యక్షులు బిజ్జారపు నవీన్ ఆధ్వర్యంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ స్వర్ణకార దుకాణాలకు అపరిచిత వ్యక్తులు వస్తే అప్రమత్తంగా ఉండాలని,అనుమానం వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వెండి బంగారు వర్తక సంఘం కార్యదర్శి తిప్పర్తి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు గాలిపెల్లి నాగరాజు,కోశాధికారి ఇల్లేందుల ఉదయ్,కార్యవర్గ సభ్యులు నాంపల్లి పవన్ కుమార్,తుమ్మనపల్లి మారుతి,ఇల్లేందుల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# బస్సు డ్రైవర్‌కు రెండేళ్ల జైలుశిక్ష

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మే 29 :** అజాగ్రత్తగా, అతివేగంగా వాహనం నడిపి వ్యక్తి మృతికి కారణమైన స్కూల్ బస్సు డ్రైవర్ లచ్చయ్యకు రెండేళ్ల జైలుశిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ ధర్మపురి కోర్టు న్యాయమూర్తి యేగి జానకి శుక్రవారం తీర్పు వెలువరించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వెల్గటూర్కు చెందిన ఆవుల సంపత్ (51) బుగ్గారం పోలీస్ స్టేషన్ పరిధిలోని బీరుసాని గ్రామ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తుండేవారని, 2017 ఆగస్టు 29న తన ద్విచక్ర వాహనంపై స్కూల్ నుండి ఇంటికి వస్తుండగా, ఏపి 25 వై 1380 నంబర్ గల స్కూల్ బస్సును నడుపుతున్న డ్రైవర్ లచ్చయ్య అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి సంపత్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఆయన తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ఘటనపై బుగ్గారం పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసిన అప్పటి ఎస్.ఐ మధుకర్ దర్యాప్తు చేపట్టి నిందితుడిపై చార్జిషీట్ దాఖలు చేశారు. కేసును సమగ్రంగా విచారించిన ధర్మపురి జెఎంఎఫ్సి కోర్టు న్యాయమూర్తి యేగి జానకి నిందితుడైన లచ్చయ్యను దోషిగా తేల్చి అతనికి రెండేళ్ల జైలుశిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

# బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే భరోసా



**చురకలు విలేకరి,మెట్‌పల్లి రూరల్, మే 29 :** భారీ అగ్నిప్రమాదంతో దగ్ధమైన ఈత వనాలతో జీవనపాధి కొలిపోయిన బాధిత కుటుంబాలు అధైర్యపడవద్దని, ఎల్లప్పుడు తమతో ఉంటామని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ గీత కార్మిక బాధిత కుటుంబాలకు భోరోసా కల్పించారు.శుక్రవారం మండలంలోని మెట్ల చిట్టాపూర్,పెద్దాపూర్ గ్రామాలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదాల్లో భారీ ఎత్తున ఈత వనాలు దగ్ధమవడంతో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు.ఎన్నో సంవత్సరాల శ్రమతో పెంచుకున్న ఈత చెట్ల వనం అగ్నికి ఆహుతి కావడం చాలా బాధాకరమని జరిగిన నష్టంపై బాధితులతో నేరుగా ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.ఈత వనాలతో జీవనాధారంగా ఉన్న కుటుంబాలు ఆందోళన చెందవద్దని తాను ఎల్లప్పుడూ వారి వెంటే ఉంటానని భరోసా కల్పిస్తూ నష్టపోయిన వారికి ప్రభుత్వం పరంగా అందాల్సిన సహాయాన్ని అందించేలా సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం అగ్ని ప్రమాదాలకు గల కారణాలను పూర్తిస్థాయిలో పరిశీలించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

# కాళేశ్వర ముక్తేశ్వర దేవస్థానం డైరెక్టర్‌గా తాటిపల్లి రాజన్న

## -బండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘన సన్మానం





**చురకలు ప్రతినిధి హుజురాబాద్ మే 29 :**జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన, దక్షిణ కాశీగా పేరొందిన శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం నూతన డైరెక్టర్‌గా హుజురాబాద్‌కు చెందిన తాటిపల్లి రాజన్న నియమితులయ్యారు. ఈ సందర్భంగా హుజురాబాద్ పట్టణంలోని హైస్కూల్ క్రీడా మైదానంలో శుక్రవారం ఆయనను స్థానికులు ఘనంగా సన్మానించారు. మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో తాటిపల్లి రాజన్నను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తాటిపల్లి రాజన్న మాట్లాడుతూ..ఇంతటి ప్రతిష్టాత్మకమైన కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవాలయ డైరెక్టర్‌గా తనకు అవకాశం కల్పించినందుకు రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. స్వామివారి కృపతో, దేవాలయ పాలకవర్గ సభ్యుల పూర్తి సహకారంతో క్షేత్రాన్ని మరింతగా అభివృద్ధి బాటలో నడిపిస్తానని, భక్తులకు అవసరమైన సదుపాయాల కల్పనకు తనవంతు శాయశక్తులా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సన్మాన కార్యక్రమానికి హుజురాబాద్ లోని వివిధ సంఘాల నాయకులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరై రాజన్నకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిప్రసాద్, కార్యదర్శి మతిన్, రిటైర్డ్ పిడి కొన్ని రాజిరెడ్డి, వేల్పుల రత్నం, పలకల ఈశ్వర్ రెడ్డి, కౌన్సిలర్ ఇల్లందుల సమ్మయ్య, బండ కిషన్, బింగి తిరుపతి, ఇల్లందుల తిరుపతి, కొలిపాక సమ్మయ్య, కుడికాల ప్రభాకర్, పాక సతీష్, ఉప్పు శ్రీనివాస్ పటేల్, మార్త రవీందర్, వెంపటి సతీష్, వేల్పుల ప్రభాకర్, సాయి, మక్కపల్లి రమేష్, కొలిపాక శ్రీనివాస్, రామాంజనేయులు, కేసరి మధుకర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో బక్రీద్..

## -ప్రేమను పంచండి.. స్వార్థాన్ని వీడండి..
## -దేశాన్ని దోపిడీ చేసింది ఆంగ్లేయులు.. దేశం కోసం ప్రాణాలర్పించింది ముస్లింలు
## -సాలెహ్ నగర్ ఈద్గాహ్ లో ముస్లింలను ఉద్దేశించి ప్రసంగించిన ముఫ్తి ఖియాస్ మొహియుద్దీన్





**చురకలు ప్రతినిధి,కరీంనగర్, మే 29 :** లబ్బయిక్ అల్లాహుమ్మ లబ్బయిక్ లాశరీక లక లబ్బయిక్ ఇన్నల్ హంద, వల్ నీమత లకవల్ ముల్క్..లాశరీక లక్, అల్లాహు అక్బర్.. లా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్ వలిల్లాహిల్ హంద్ నినాదాలతో వీధులు, మజీదులు ,ఈద్గాలు మారుమోగాయి. ఈదు ఉల్ అజ్హా వేడుక సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం బక్రీద్ వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచే ముస్లీం సోదరులతో ప్రార్థన స్థలాలన్నీ కిటకిటలాడాయి. సామూహిక ప్రార్థనలు అనంతరం మత గురువులు అందించే ధర్మ సందేశాలను విన్నారు. కరీంనగర్ లోని రేకుర్తి సాలెహ్ నగర్, చింతకుంట వద్ద ముస్లీం సోదరులు పెద్దఎత్తున తరలివచ్చి ప్రార్థనలో పాల్గొన్నారు. ట్రాఫిక్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. వాహనాలన్నీ వర్క్ షాపు మైదానంలో పార్కింగ్ ఏర్పాటుచేశారు. ఎస్సారార్ కళా శాల నుంచి ఈద్గా వరకు వాహనాలను అనుమతించకుండా పర్యవేక్షించారు. బైపాస్ రోడ్డులో అహ్మద్ ఈద్గా, నగరంలోని వన్ టౌన్ పురాతన ఈద్గాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. నగర పాలక సంస్థ, విద్యుత్,వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినందుకు ముస్లిం సమాజం పక్షాన ముఫ్తి ఖియాస్ కృతజ్ఞతలు తెలిపారు. సాలెహ్ నగర్ ఈద్గా వద్ద సదర్ ఖాజీ మన్జబత్ షా ఖాన్ నమాజ్ చేయించగా, మత పెద్ద ఈద్గా ఖతీబ్ ముఫ్తి మహమ్మద్ ఖియాస్ మొహియుద్దీన్ సందేశాన్ని అందించారు. ఈదుల్ అజ్హా పర్వదినాన్ని ముస్లీం సోదరులు ఘనంగా జిల్లావ్యాప్తంగా భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. జిల్లాలోని పలు మండలాల్లో పండుగ ఈద్ నమాజు ఆచరించారు. కొందరు ముస్లీంసోదరులు తమ సమీప ముస్లిమేతర స్నేహితులను ఇండ్లకు ఆహ్వానించి సేమియా, పాయసం వడ్డించివారితో ఆనందం పంచుకున్నారు. ఈసందర్భంగా ముఫ్తి ఖియాస్ మొహియుద్దీన్ మాట్లాడుతూ హజరత్ ఇబ్రహీం అలైహివ సలాం, హజరత్ ఇస్మాయిల్ అలైహి సలాంలా త్యాగనిరతికి గొప్ప చిహ్నామే ఈ బక్రీద్ పండుగని చెప్పారు. అల్లాహ్ ప్రియ ప్రవక్తలైన వీరు త్యాగం చేసి,ఐదువేల సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ నేటికీ వారి త్యాగస్మృతికి గుర్తుగా బక్రీద్ పండుగను నిర్వహించుకోవడం నేటికీ ఆనవాయితీగా వస్తుందన్నారు. భయపెట్టిస్తే భయపడడానికి ముస్లింలు పిరికి వాళ్ళు కాదని,దేశంలో రాజ్యాంగం కల్పించినటువంటి హక్కులను చట్టానికి లోబడి ఉండి పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కొన్ని కరుడుగట్టిన అతివాద సంస్థలు బక్రీద్ నెల రాగానే ఆకాశము ఊడిపడ్డట్టు అనవసరమైన రాద్ధాంతాన్ని చేస్తున్నాయని విమర్శించారు. ముస్లింల రక్తంలో భయం లేదన్నారు. భారతదేశం ఏఒక్కరి సొత్తు కాదని,ఇది ప్రజాస్వామ్యయుత దేశమని, ఇక్కడ అన్ని కులాలు, మతాలు విభిన్న సంస్కృతుల మేలవింపు ఉందని భారతదేశం అంటేనే భిన్నత్వంలో ఏకత్వం ఈ దేశ ఔన్నత్యమని,ప్రపంచ దేశాలకు ఆదర్శంగా భారతదేశ సంస్కృతి ఉందని గుర్తు చేశారు. హజ్రత్ ఇబ్రహీం అలైహి సలాం,ఇస్మాయిల్ సలాంలా త్యాగాలను స్మరించుకోవాలని మహనీయ మహమ్మద్ ప్రవక్త సల్లం ఆశయాలకు అనుగుణంగా ప్రతి ముస్లిం జీవించాలని కోరారు. దేశాన్ని సుమారు 900 సంవత్సరాలకు పైచిలుకు ముస్లిం రాజులు పరిపాలించినప్పటికీ ఇక్కడి భూమిని వనరులను ఇక్కడి ఆస్తులను ఎక్కడికో ఎత్తుకెళ్లలేదని ఎవరు దోపిడీ చేయలేదని వాళ్లంతా ఇక్కడే పాలించబడి ఈ భూమిపైనే మరణించారని గుర్తు చేశారు. కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ముస్లింలను టార్గెట్ చేస్తూ అణగదొక్కాలని కుట్రలను కుతంత్రాలను సమర్థవంతంగా ముస్లింలందరూ ఏకతాటిపైకి వచ్చి ఎదుర్కోవాలన్నారు. దేశాన్ని 200 సంవత్సరాలు పరిపాలించిన ఆంగ్లేయులు దేశాన్ని దోపిడీ చేశారని ఈ దేశం కోసం ఆంగ్లేయులతో అలుపెరగని పోరాటం చేసి ముస్లింలు ప్రాణ త్యాగం చేశారని చెప్పారు. దోపిడీ చేసిన ఆంగ్లేయుల గురించి ఎవరు మాట్లాడారని దేశం గర్వించదగ్గ పనులు చేసిన ముస్లింలను మాత్రం ఆడిపోసుకోవడం అలవాటైపోయింది అన్నారు. ప్రపంచ చరిత్రలో ఎంతోమంది నియంత పాలకులను ఇస్లాం ధర్మాన్ని పాటించే ముస్లింలు భరించారని, కొన్ని సందరర్భాలలో తమ అస్తిత్వాన్ని నిలుపుకునేందుకు ఇస్లాం ప్రియ ప్రవక్తలు అలుపెరుగని పోరాటాలు చేశారని,తద్వారా ఇస్లాం గెలిచి నిలిచిందన్నారు. ఒక వర్గపు జీవన సంస్కృతి విధానాలను ఇతర ధర్మాలపై రుద్దుతామంటే కుదరదని, కొందరు ఇతరులను కవ్వించడానికి అప్పుడప్పుడు మన సహనానికి పరీక్ష పెడుతుంటారని కాసేపు సహనంతో పరీక్షను ఎదురుకోక తప్పదని, సహనం ఓపిక నశించిన తర్వాత జవాబు ఖచ్చితంగా దానికి అదేదొరుకుతుందన్నారు. ప్రజాస్వామ్య దేశంలో అందరికీ జీవించే హక్కు వారి ధర్మాలకనుగుణంగా ఉంటుందన్నారు. పోరాటాలు చేయడం ప్రాణాలను అర్పించడం చరిత్రలో ముస్లింలకు కొత్తేమీ కాదని ఇది ప్రవక్తల కాలం నుండి అనాదిగా వస్తున్నదే అని చెప్పారు ముస్లింలు ఎలాంటి విపత్కర పరిస్థితి ఎదురైనా ఆందోళన చెందవద్దని అసలే భయపడవద్దని మనతో ఎవరూ లేకున్నా మన దైవం అల్లా మనతో ఎప్పటికీ ఉంటాడని నమ్మకాన్ని కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఇతరులు భయపెట్టిస్తే భయంతో బ్రతకడము ముస్లింల రక్తంలోనే ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, ఈద్గా పీఆర్వో మహమ్మద్ రఫీ, అహ్మద్ హిఫ్జి, మాజీ కార్పొరేటర్ అరిఫ్ అహ్మద్, ముకరంపుర కార్పొరేటర్ మాజీద్ హుస్సేన్, వాజిద్ అలీఖాన్, కాంగ్రెస్ నాయకులు ఆమెర్, బిఆర్ఎస్ నేత కృష్ణ గౌడ్, మాజిద్ తదితరులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాద సంఘటన స్థలాలను పరిశీలించిన కాంగ్రెస్ నేత వొడితల ప్రణవ్



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ మే 29 :** ఇటీవల ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతి అయిన ప్రమాద స్థలాలను హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ పరిశీలించారు. శుక్రవారం జమ్మికుంట మండల పరిధిలోని తనుగుల, మడిపల్లి, అంకుశాపూర్,కమలాపూర్ మండలంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి పర్యటించారు. ప్రమాదానికి గల కారణాలను గీత కార్మికులు వివరించారు. ప్రమాదం జరిగిన తెలిసిన వెంటనే అధికారులకు నష్టం అంచనా వేయమని సూచించామని తెలిపారు. ఈ సందర్భంగా రైతులు వరి కొయ్యలను కాల్చి పర్యావరణానికి హాని కలిగించొద్దని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రైతులకు అవగాహన కల్పించేలా కృషి చేయాలని కోరారు. సంఘటన స్థలం నుండి అధికారులకు ఫోన్ చేసి పరిస్థితి వివరించారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచులు,వార్డ్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి



## -జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**చురకలు ప్రతినిధి,నిర్మల్, మే, 29 :** జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను అత్యంత వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఖానాపూర్, కడెం మండలాల్లోని పలు రైస్ మిల్లులను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, క్షేత్రస్థాయిలో అందుతున్న సేవలపై సమీక్ష నిర్వహించారు. ఖానాపూర్ మండలం సత్తనపల్లి గ్రామంలోని ఏఆర్ఎస్ రైస్ మిల్లుతో పాటు కడెం మండలంలోని లక్ష్మీ అన్నపూర్ణ రైస్ మిల్లు, నవాబ్‌పేట్, పెద్దబెల్లాల్, నచ్చన్ ఎల్లాపూర్ గ్రామాల్లోని పలు రైస్ మిల్లులను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా మిల్లుల్లో జరుగుతున్న ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. మిల్లుల నిల్వ సామర్థ్యం, ఇప్పటివరకు అన్లోడ్ చేసిన ధాన్యం వివరాలు, అందుబాటులో ఉన్న ఖాళీ స్థలం,రోజువారీ సగటు అన్లోడింగ్ సామర్థ్యం అంశాలపై అధికారులను, మిల్లు నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మిల్లుకు సంబంధించిన పలు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అన్లోడింగ్ ప్రక్రియలో ఆలస్యం జరగకుండా అవసరమైన మేరకు ఎక్కువమంది హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని మిల్లు నిర్వాహకులకు సూచించారు. స్థానిక అధికారులు రైస్ మిల్లుల వద్ద అన్లోడింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ, లారీలు త్వరగా ఖాళీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు వేచిఉండే పరిస్థితి తలెత్తకుండా, సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు, గోదాములకు తరలించాలని స్పష్టం చేశారు. మిల్లుల తనిఖీ అనంతరం కడెం మండల తహసిల్దార్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై కలెక్టర్ ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వివరాలు, ఇప్పటివరకు సేకరించిన ధాన్యం, ఇంకా కొనుగోలు చేయాల్సిన ధాన్యం పరిమాణంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ ముగింపు దశకు చేరుకున్న నేపథ్యంలో,మిగిలిన ప్రక్రియను కూడా యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీలు,సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ)కిషోర్‌కుమార్, పౌరసరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, తహశీల్దార్లు సుజాత, మొయినుద్దీన్, ఎంపీడీవోలు రాధ,అరుణ,ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.